క్లుప్తంగా

రక్తహీనతకు చెక్

కడప కోటిరెడ్డిసర్కిల్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి తెలిపారు. స్థానిక అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పండించిన ఆకు కూరలు, కూరగాయలు పంపిణీ చేస్తున్నామన్నారు. సీడీపీఓలు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్


రాజగోపాల్‌రెడ్డి

కడప కార్పొరేషన్: కాకినాడ ఆదిత్య యూనివర్సిటీలో సహాయ అధ్యాపకుడిగా పనిచేస్తున్న సగిలి రాజగోపాల్‌రెడ్డికి డాక్టరేట్ లభించింది. వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి మండలానికి చెందిన ఆయన ఆన్ సూపర్‌వైజ్డ్ మెషిన్ లెర్నింగ్ అల్గారిథం ద్వారా హృదయ సంబంధ వ్యాధుల విశ్లేషణ మరియు అంచనా అంశంపై చేసిన పరిశోధనలకు తిరుచ్చి భారతీ దాసన్ యూనివర్సిటీ ఈ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈయన పలు కళాశాలల్లో కంప్యూటర్ అధ్యాపకుడిగానూ, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో ప్రాంతీయ నైపుణ్యాభివృద్ధి అధికారిగా ఐదేళ్లు పనిచేశారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రభుత్వం నిర్వహిస్తున్న జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ అన్నారు. మైదుకూరు, జమ్మలమడుగులో మినీ జాబ్‌మేళా నిర్వహించగా.. 103 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. అభ్యర్థులు విధుల్లో చేరి అంచెలంచెలుగా ఎదగాలని ఆయన కోరారు.

సంపూర్ణ అక్షరాస్యత అవసరం

కడప అర్బన్: సంపూర్ణ అక్షరాస్యత సమాజాభివృద్ధికి అవసరమని వయోజన విద్య ఉమ్మడి జిల్లా ఉపసంచాలకులు ఎం.వి సుబ్బారెడ్డి అన్నారు. 58వ అంతర్జాతీయ అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా కడప కేంద్ర కారాగారంలో సూపరింటెండెంట్, ఇన్‌ఛార్జ్ డిఐజీ రాజేశ్వరావు చేతుల మీదుగా గురువారం ఖైదీలకు వాచకములను పంపిణీ చేశారు. అక్షరాస్యత ప్రాధాన్యత, ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌లు జవహర్‌బాబు, రమేష్, వయోజన విద్య సూపర్‌వైజర్లు సోమశేఖర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి శ్రీరామ్‌రెడ్డి లక్ష్మీనర్సారెడ్డి ఖైదీలు పాల్గొన్నారు.

దేశ నిర్మాణ సేవలో ఎల్ఐసీ

కడప కల్చరల్: వ్యాపారం, దేశ నిర్మాణం, ఇతర సేవల్లో ఎల్ఐసీ పాత్ర కీలకం అని సీనియర్ డివిజనల్ మేనేజర్ జీకేఆర్‌వీ.రవికుమార్ అన్నారు. బీమా వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజున ఎల్ఐసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు, అధికారులు, ఏజెంట్లు, పాలసీదారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎస్‌డీఎం రవికుమార్ మాట్లాడుతూ 70 శాతం మార్కెట్ షేర్‌తో ఎల్ఐసీ లైఫ్ ఇన్సూరెన్స్ మార్కెట్‌ను శాసిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో శ్యాంసుందర్‌రావు, సాల్మన్‌రాజు, శ్రీనాథ్‌రెడ్డి, వెంకటకృష్ణ, నిత్యానందరెడ్డి, చంద్రపాల్, సంజయ్, రఘునాథరెడ్డి, శ్రీనివాస్, సుధీకర్, రామాంజనేయులు, రెడ్డిభాస్కర్, హబీబుల్లాఖాన్ పాల్గొన్నారు.

గురువుల బాధ్యత గొప్పది


పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో డా.ఎం.రాజేంద్రసింగ్‌ను సత్కరిస్తున్న సిబ్బంది


వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న వైవీయూ బోధనేతర సిబ్బంది


కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో సంప్రదాయ దుస్తులతో రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాష్టార్లు

కడప ఎడ్యుకేషన్ : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపళ్లు అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ జయంతి సందర్భంగా కడప నగరంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, పింఛనర్ల సంఘం కార్యాలయంలో గురువారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు డాక్టర్ రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కడప కోటిరెడ్డిసర్కిల్ : సమాజంలో తల్లిదండ్రుల తర్వాత పిల్లలపై గురువుల బాధ్యత గొప్పదని సాధన విద్యా సంస్థల విద్యా సాధన సంస్థల చైర్మన్ లయన్ పి.ఖాసీంఖాన్, కరస్పాండెంట్ పి.మన్సూర్ అలీఖాన్ తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం విద్యా గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యావేత్తలు షరీఫ్ ఖాన్, వెంకటరమణ, జిలానీ బాషా, ఓబులేసు, డాక్టర్ రామకృష్ణలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాహిర్, తారీక్ అలీ, జావీద్, తౌసిఫ్ అమీన్, సాయి, సైఫ్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో వీసీ, రిజిస్ట్రార్‌లకు సన్మానం

వైవీయూ: గురువులు రేపటి తరానికి మార్గదర్శకులు అని అధ్యాపకులు పేర్కొన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా యోగివేమన విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డిలను గురువారం ఘనంగా సత్కరించారు. అనంతరం వైవీయూ సైన్స్, ఆర్ట్స్, కామర్స్ విభాగాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో.

కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డా.కె.సూర్యనారాయణ రెడ్డి, అధ్యాపకులు డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపల్ రెడ్డప్ప, ఎన్ఎస్ఎస్ పీఓలు విజయ్‌కుమార్, శ్రావణి, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో.

వైవీయూ: కడప నగరంలోని కేంద్రీయ విద్యాలయంలో గురువారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ మునేష్ మీనా డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బాధ్యత కలిగిన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అన్నారు. అనంతరం 2025 జూన్‌లో సూపర్ యానిమేట్ కాబోతున్న డా.ఎం. రాజేంద్రసింగ్‌ను ఆయన సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యా బోధన

కడప ఎడ్యుకేషన్ : నవతరానికి తగినట్లుగా నేటి ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్యా బోధన సాగించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. కడప అక్కాయపల్లి సాయిబాబా విద్యా సంస్థలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన డాక్టర్ రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విశ్రాంత హెచ్ఎం వాసుదేవరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఎంవి.శ్రీదేవి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

శాంతినికేతన్ హైస్కూల్‌లో..

శంకరాపురంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ ఎలియాస్ రెడ్డి హెడ్ మాస్టర్ రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.

గురుకుల విద్యాపీఠం హైస్కూల్‌లో..

కడప గురుకుల విద్యాపీఠంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవీఆర్ విద్యా సంస్థల అధినేత వెంకటేశ్వర్లు, డైరెక్టర్ వీరకుమారి, సీఈఓ వివేకానంద, ప్రిన్సిపల్ మునిచంద్ర రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఎన్నో ఏళ్ల కల సాకారమైన వేళ

క్రీడా మైదానం ప్రారంభించిన రిమ్స్ అధికారులు


కడప రిమ్స్ ఆవరణలో క్రీడా మైదానం ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ, అధికారులు

కడప అర్బన్: ప్రతిష్టాత్మకమైన కడప ప్రభుత్వ వైద్య కళాశాల(రిమ్స్)లోని 500 మీటర్ల వృత్తంలో 216 చదరపు అడుగుల క్రీడా మైదానం ఏర్పాటు చేశారు. ఈ మైదానం చుట్టూ వీక్షకుల కోసం 40 బల్లలను వైద్య అధ్యాపకులు వితరణ చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం ×స్పోర్ట్స్ ఎరీనా×గా మారిన ఎర్రని నేల పులకించిపోయింది. విద్యార్థులు, అధ్యాపకుల కరతాళ ధ్వనుల మధ్య అడిషనల్ డిఎంఈ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.రమాదేవి, సూపర్ స్పెషాలిటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సురేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ క్రీడా మైదానానికి ×స్పోర్ట్స్ ఏరీనా× అని నామకరణం చేశారు. కళాశాల స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ వెంకట మనోజ్, డాక్టర్ బి. పవన్‌కుమార్ ఈ వేడుకలను పర్యవేక్షించారు. ఈ మైదానాన్ని ఉపయోగించుకుని విద్యార్థులు తమ నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవాలని రాష్ట్ర, అంతర్రాష్ట్ర కళాశాల పోటీలలో మరిన్ని పతకాలు సాధించాలని ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ అకాంక్షించారు.

సమాజానికి మార్గదర్శి మరియ మాత

కడప కల్చరల్: మరియ మాత మానవ సమాజానికి మార్గదర్శిగా నిలిచారని, ఆ తల్లి లేకపోతే పిల్లలు పవిత్రమైన గమ్యం చేరుకోలేరని ముద్దనూరు, పాలూరు విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ మర్రెడ్డి, రెవరెండ్ ఫాదర్ ప్రకాష్ అన్నారు. నగరంలోని ఆరోగ్యమాత పుణ్య క్షేత్రం నవదిన ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజున ఫాదర్ ప్రకాష్ దివ్యబలి పూజ సమర్పించగా, ఫాదర్ మర్రెడ్డి మరియ మాత సందేశాన్ని వినిపించారు. అనంతరం చర్చి ఆవరణలో అలంకరించిన పల్లకీలో మరియమాత స్వరూపాన్ని ఉంచి ప్రదక్షిణ నిర్వహించారు. గురువులను శాంతి సేవా సొసైటీ జ్ఞాపిక, పూలమాల, శాలువతో సత్కరించింది. పుణ్య క్షేత్రం డైరెక్టర్ రెవ ఫాదర్ ఎండీ. ప్రసాదరావు, ఫాదర్ బాలరాజు, బిషప్ సెక్రటరి లూర్దురాజు, విజయరావు, సహాయ డైరెక్టర్ పిల్లి మహేష్, చర్చి పెద్దలు జోజప్ప, మోహన్, జార్జి, రాయపరెడ్డి, చిన్నపరెడ్డి, విన్సెంట్ డి పాల్, మరియదళం, మౌలిక సంఘం, శాంతి సేవా సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి


ఆఫీసర్స్ క్లబ్‌లో ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ ఎం.వి రామచంద్రారెడ్డి

కడప అర్బన్: కడప ఆఫీసర్స్ క్లబ్ ఈత కొలను, టేబుల్ టెన్నిస్ విభాగం సభ్యులు తమ క్లబ్ సభ్యులైన 20 మంది ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు ఎం.వి. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. క్లబ్ సభ్యులు జానమద్ది విజయభాస్కర్, విశ్రాంత అధ్యాపకులు చిన్నపురెడ్డి, గోపాల్‌రెడ్డి, కవి ఎల్లారెడ్డి, ఇంటర్ ఆర్‌జెడి రవి, శ్రీరామిరెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికారసంస్థ సభ్యులుగా నియమితులైన జానమద్ది విజయభాస్కర్‌ను సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు లేబాక మధుసూదన్‌రెడ్డి సుబ్బరామయ్య, రవీంద్ర, రమణయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం


జింకా విజయలక్ష్మి


గానుగపెంట శ్రీనివాసులు


రసూల్ సాహెబ్

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర అధ్యక్షులను నియమించారు. నూర్‌బాష్, దూదేకుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పులివెందులకు చెందిన ఓతూరు రసూల్ సాహెబ్, పద్మశాలీ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా ప్రొద్దుటూరుకు చెందిన జింకా విజయలక్ష్మి, సగర, ఉప్పర విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా బద్వేల్‌కు చెందిన గానుగపెంట శ్రీనివాసులు(బంగారు శీనయ్య)లను నియమించారు.

వైద్య సేవలపై ఫిర్యాదులు వస్తే చర్యలు

- 10 కేసులకు రూ.1.54 లక్షలు జరిమానా
- డిస్ట్రిక్ట్ డిసిప్లినరీ కమిటీ సమావేశంలో కలెక్టర్ శివశంకర్ లోతేటి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్: ఎన్టీఆర్ వైద్య సేవల నెట్వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద ఆరోగ్య సేవలు పొందిన వారి నుంచి ఫిర్యాదులు వస్తే ఆస్పత్రులపై చర్యలు తప్పవని కలెక్టర్ శివశంకర్ లోతేటి హెచ్చరించారు.

గురువారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో డిస్ట్రిక్ట్ డిసిప్లినరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించి ఆసుపత్రులపై ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా అందిన ఫిర్యాదులపై సంబంధిత ఆసుపత్రుల యాజమాన్యంతో కలెక్టర్ విచారణ చేసి జరిమానాలు విధించారు. కడపలో హోలిస్టిక్, తిరుమల, సన్‌రైజ్ ఆసుపత్రులు, ప్రొద్దుటూరులోని కేవీఆర్ ఆసుపత్రి, పులివెందులలోని శ్రీ రాజా రాఘవేంద్ర ఆసుపత్రి ఇలా మొత్తం ఐదు నెట్వర్క్ ఆస్పత్రులకు సంబంధించి 14 ఫిర్యాదులు వచ్చాయని ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ బాలాంజనేయులు కలెక్టర్‌కు తెలిపారు.ఇందులో ఎక్కువ కేసులు లబ్ధిదారుడి నుంచి డబ్బులు తీసుకొని వైద్యం అందించారని ఫిర్యాదులు అందాయని ఆయన కలెక్టర్ కు విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనల మేరకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలను పూర్తి ఉచితంగా మెరుగైన ట్రీట్మెంట్ ను అందించాలన్నారు. డబ్బులు ఎందుకు తీసుకోవాల్సి వచ్చింది? ఎందుకు రీఫండ్ చేయాల్సి వచ్చిందన్న అంశంపై సంబంధిత ఆసుపత్రుల యాజమాన్యాన్ని కలెక్టర్ ప్రశ్నించారు. అనంతరం అయిదు ఆసుపత్రులకు సంబంధించి మొత్తం 14 కేసులలో 10 కేసులకు రూ.1.54 లక్షలు పెనాల్టీ చెల్లించాలని కలెక్టర్ ఆదేశించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, డీసీహెచ్ఎస్ డాక్టర హిమదేవి, ఏడీ ఐ–పీఆర్ వేణుగోపాల్ రెడ్డి, డీఎం రమేష్ బాబు, ఆసుపత్రుల యాజమాన్యాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్థావరాలపై దాడులు చేయిస్తాం

జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్: జిల్లాలో గంజాయి స్థావరాలపై విస్తృతంగా దాడులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశించారు. గంజాయి నిర్మూలనపై డిఎన్‌సిసి టీంతో గురువారం ఆయన సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోకి గంజాయి రాకుండా నిఘా వుంచి కట్టడి చేయాలని ఆదేశించారు. దాంతో కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం డిఎన్‌సిసి టీమ్ ఆధ్వర్యంలో దాడులు, నమోదైన కేసుల వివరాలు గురించి ఆరా తీశారు. గత 40 రోజుల్లో 17 కేసులు నమోదు చేసి 34 మందిని అరెస్టు చేశామని, 29 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పోలీసు అధికారులు తెలిపారు. గంజాయి తీసుకుంటూ పట్టుబడిన వంద మందికి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు డిఎన్‌సిసి అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో వెంకటకుమార్, డిఎన్‌సిసి అధికారులు, స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులపై నేతన్న దాతృత్వం!


కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న అనంతరామయ్య

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్రంలో తుఫాను, వరద బాధితుల సహాయార్థం మాధవరానికి చెందిన ఎంవీఎస్ ఎక్స్‌క్లూజివ్ హ్యాండ్లూమ్స్–టెక్స్‌టైల్స్ మేనేజింగ్ పార్టనర్ ఎం.అనంతరామయ్య రూ.25,000 ఆర్థిక సాయం అందించారు. సంబంధిత చెక్కును గురువారం రాత్రి కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్ శివశంకర్ లోతేటికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వరద బాధితులకు ఆపన్న హస్తం అందించే ప్రయత్నంలో భాగంగా సాయం అందిస్తున్న దాతలందరికీ ధన్యవాదాలు తెలుపుకొంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్‌లూమ్స్ ఏడీ నాగరాజరావు, చేనేత సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ సూపర్‌వైజింగ్ అధికారిగా సత్యానదమ్

కడప అగ్రికల్చర్: డిస్ట్రిక్ కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)లో పరిపాలన పర్యవేక్షణ సూప ర్‌వైజింగ్ అధికారిగా సత్యానదమ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

ఆధిక్యంలో అనంత జట్టు

కడప స్పోర్ట్స్: కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–23 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. కేఎస్ఆర్ఎం మైదానంలో గురువారం నిర్వహించిన మ్యాచ్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 133 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని సుబ్రహ్మణ్యం 58 పరుగులు చేశారు. అనంత బౌలర్లు మల్లికార్జున 4, లోహిత్‌సాయి 3, భార్గవ్ 3 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంత జట్టు 48 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 235 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులోని హనీష్ వీరారెడ్డి 142 బంతుల్లో 12 ఫోర్లు, 6 సిక్సర్లతో 114 పరుగులు చేశాడు. ఈయనకు జతగా రోహిత్ రోషన్ 49 పరుగులు చేసింది. నెల్లూరు బౌలర్లు మాధవ్ 3, భార్గవ్ 2, సుతేజ్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 8 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 40 పరుగులు చేసింది. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో..

వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో కడప, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు 51 ఓవర్లలో 223 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని జాఫర్ అలీఖాన్ 79 పరుగులు, శివకేశవ రాయల్ 40 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లు కనిష్ 7 వికెట్లు, సాయి సూర్యతేజారెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 21.4 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది. జట్టులోని సాయిసూర్యతేజారెడ్డి 37 పరుగులతో క్రీజులో ఉన్నాడు. కడప బౌలర్ అయూబ్ 2 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

మట్టి గణేష్ విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించండి


నిమజ్జన స్థలం పరిశీలిస్తున్న ఎస్పీ

కడప సెవెన్‌రోడ్స్: సహజ రంగులతో తయారు చేసిన మట్టి గణేష్ విగ్రహాల వాడకాన్ని ప్రోత్సహించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడదామని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. సహజ రంగులతో మట్టి విగ్రహాలను తయారు చేయడం స్వచ్ఛతకు చిహ్నమే గాక.. ఖర్చు తగ్గి ఆర్థిక వెసులుబాటు కలుగుతుందన్నారు. చెరువులు, జల వనరులకు నష్టం కలిగించే వ్యర్థ పదార్థాల వినియోగం తగ్గించాలని కోరారు. వినాయక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగుల వినియోగంతో జలప్రాణులు కాలుష్యానికి గురవుతున్నాయన్నారు. వీటి వలన జలకాలుష్యంతోపాటు, వృక్ష, జంతు జీవనంపై ప్రభావం కలుగుతుందన్నారు. విష రసాయన వ్యర్థాలు కలపడంతో ఊపిరితిత్తులతోపాటు, చర్మ, రక్త, కంటి వ్యాధులు వస్తాయన్నారు. పండుగ రోజులలో లౌడ్ స్పీకర్ల వినియోగం తగ్గించాలన్నారు.

విద్యుత్ ప్రమాదాలను అరికట్టండి

భద్రతా నియమాలు పాటించి విద్యుత్తు ప్రమాదాలను అరికట్టాలని ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ పేర్కొన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ విద్యుత్తు భూతంతో సమానమని, చిన్న తప్పిదం పెను విషాదానికి దారి తీస్తుందన్నారు. హెచ్చరికలు లెక్కచేయకుండా వినాయక పందిళ్ల విద్యుత్ లైన్లకు అతి సమీపంలో వేస్తున్నారని, దీంతో ప్రమాదం పొంచి ఉందనే విషయాన్ని గమనించాలన్నారు. ఉత్సవ కమిటీ పెద్దలు యువతకు చెప్పి విద్యుత్తు లైన్లకు దూరంగా వేయించాలన్నారు. పందిళ్లలో అతుకులు లేకుండా నాణ్యమైన విద్యుత్తు ఉపకరణాలు ఉపయోగించాలని కోరారు. పందిళ్లకు ఇనుప పైపులకు బదులు కొయ్యలు, ప్లాస్టిక్ పైపులు ఉపయోగించుకోవాలన్నారు. భారీ విగ్రహాలను ఊరేగించేటప్పుడు విద్యుత్ లైన్ల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు.

భద్రతా ఏర్పాట్ల పరిశీలన

కడప అర్బన్: వినాయక నిమజ్జనం జరిగే పాత కడప చెరువు వద్ద జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు గురువారం భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా వినాయక విగ్రహాలను ఎత్తే భారీ క్రేన్లు, డ్రైవర్లను సిద్ధంగా వుంచుకోవాలని తెలిపారు. ఎలాంటి ఘటనలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని, నిమజ్జన ప్రాంతంలో లైటింగ్, వైద్య సిబ్బంది, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ వెంట అదనపు ఎస్పీ జి.వెంకటరాముడు, ఎస్.బిఇన్స్‌పెక్టర్ యు.వెంకటకుమార్, టూటౌన్ సి.ఐ నాగార్జున, తాలూకా సీఐ వెంకటేశ్వర్లు, చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌నాయక్, ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజు నాయక్, వున్నారు.

వైఎస్ కుటుంబాన్ని నమ్ముకున్న మీకు న్యాయం చేస్తాం


మాజీ సీఎం వైఎస్ జగన్‌తో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, రెడ్యం సోదరులు

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్ కుటుంబాన్ని నమ్మి ఎలాంటి షరతులు లేకుండా వైఎస్సార్‌సీపీ కోసం పని చేస్తున్న తమకు తప్పక న్యాయం చేస్తానని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని ఏపీఎస్ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షులు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన వైయస్ జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా రెడ్యం వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ తనకు సొంత అజెండా లేదని, పార్టీ అధికారం కోల్పోయినా మీ వెంటే ఉంటామని అన్నారు. జగన్ ఆప్యాయంగా పలకరించి.. తగు న్యాయం చేస్తానని భరోసా కల్పించడంపై ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

ఘనంగా ఉరుసు ఉత్సవం

కడప కల్చరల్ : ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రం కడప అమీన్‌పీర్ దర్గాలో గురువారం ఉరుసు ఉత్సవం ఘనంగా జరిగింది. హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అమీనుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్టివుల్ ఖాద్రి పేరిట జరుగుతున్న ఈ ఉత్సవంలో దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలంకరించిన గంధం కలశాన్ని తలపై ఉంచుకుని ఊరేగింపుగా దర్గాకు చేరుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన శిష్యగణం ఆయన వెంట రాగా, ఫకీర్లు సాహస విన్యాసాలు చేస్తూ సాగారు. బ్యాండు మేళాల మధ్య దర్గాలోని గురువుల మజార్ వద్దకు చేరుకుని అక్కడ గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హాజరైన భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బీ.అంజద్‌బాషా, ఇతర నాయకులు కూడా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ ఖవ్వాలీ గాయకులు అమీల్ ఆరీఫ్ సాబ్రి మిరాట్ ఖవ్వాలీ కచేరి అందరినీ అలరించింది.

11 నుంచి రిలే నిరాహార దీక్షలు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప రీజియన్‌లో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 11వ తేదీన అన్ని డిపోలలో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నామని ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజినల్ అధ్యక్ష, కార్యదర్శులు నాగముని, సుధాకర్ తెలిపారు. సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ అధికారులకు విన్నవించి ఎర్ర బ్యాడ్జీలు ధరించి ఇప్పటికే గేట్ మీటింగ్ ఏర్పాటు చేశామన్నారు.